క్లుప్తంగా

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ములుగు రూరల్: ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగలను జరుపుకోవాలని సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని జంగాలపల్లి, కాశిందేవిపేట గ్రామాల్లో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. మొహర్రం పండుగను ప్రజలు కలిసి మెలసి జరుపుకోవాలని అన్నారు. గొడవలను ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోతుల బెడద కట్టడికి చర్యలు



మంగపేట: మండలంలోని కమలాపురంలో కోతుల బెడదను కట్టడి చేసేందుకు గ్రామస్తులు నడుం బిగించారు. గ్రామంలో గత కొంత కాలంగా కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోతుల బెడదను అరికట్టాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోక పోవడంతో గ్రామస్తులందరూ ఒక కమిటీని ఎన్నుకున్నారు. కోతులను సంబంధించి దూరప్రాంత అడవిలో వదిలి పెట్టేందుకు నిర్ణయించుకున్నారు. కోతులను పట్టే వారిని రప్పించేందుకు అయ్యే ఖర్చులను గ్రామంలోని కుటుంబాలు, వ్యాపారుల నుంచి కమిటీ ఆధ్వర్యంలో చందాలను సేకరిస్తున్నారు.

చెట్టును తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం



మంగపేట: మండలంలోని బోరునర్సాపురం బస్‌షెల్టర్ సమీపంలో మర్రి చెట్టు విద్యుత్‌లైన్ మీద పడటంతో మూడు స్తంభాలు విరిగి పోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు మరో లైన్ ద్వారా కరెంటును పునరుద్ధరించారు. చెట్టును తొలగించడంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పడిపోయిన భారీ చెట్టును తొలగించి విరిగిపోయిన కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి



ఏటూరునాగారం: ఎస్సీ, ఎస్టీలపై దాడి చేస్తే వెంటనే వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధరంసోత్ అనసూయ ఇంటిని కూల్చివేసిన స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలోని వై జంక్షన్ దగ్గరలో గల లింగంపల్లి లక్ష్మీనారాయణకు చెందిన 26 గుంటల భూమిని ధరంసోత్ అనసూయ అనే గిరిజన మహిళకు విక్రయించాడని తెలిపారు. అదే స్థలంలో అనసూయ రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ రేకుల షెడ్డును లింగంపల్లి లక్ష్మీనారాయణ కూల్చివేశాడని తెలిపారు. పది రోజుల క్రితం సాయిబాబా దేవాలయానికి వెళ్లిన ధరంసోత్ అనసూయతో పాటు ఆమె కుమారుడు రఘుపై ప్రైవేట్ గుండాలతో దాడి చేయించాడని ఆరోపించారు. లక్ష్మీనారాయణపై వెంటనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్, జగ్‌రాం నాయక్, రఘు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్టీ బాలుర వసతి గృహాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లాలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, అశిష్, సిబ్బంది యాకమ్మ, రాఘవులు, రాజేష్ సుశీల, పార్వతి తదితరులు ఉన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం
- యూటర్న్ పాయింట్ దగ్గర పనిచేయని సిగ్నల్స్
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

చల్వాయిలోని గెస్ట్ హౌస్ దగ్గర సిగ్నల్ పోల్స్ లేని యూటర్న్ పాయింట్



ప్రమాదకరంగా యూటర్న్‌లు!

గోవిందరావుపేట : మండలంలోని జాతీయ రహదారి–163 పై నిర్మించిన డివైడర్లు దడ పుట్టిస్తున్నాయి. రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారుతున్నాయి. రైట్–లెఫ్ట్ రహదారులని వేరు చేసేందుకు ఏర్పాటు చేసిన డివైడర్లు గ్రామీణవాసుల ప్రాణాలను హరిస్తున్నాయి. యూటర్న్ దగ్గర సోలార్ బ్లింకర్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. మండలంలోని జాతీయ రహదారిపై యూటర్న్‌ల దగ్గర వాహనదారులు, గ్రామస్తులు రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదాలకు గురి అవుతున్నారు. మండలంలోని మచ్చాపూర్ నుంచి పస్రా వరకు ఉన్న డివైడర్ల దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక, ఉన్న కొన్ని వాటికి ఫ్లెక్సీలు కట్టడం వల్ల ఢీకొని ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. విశాలంగా ఉండడంలో వాహనాలు ఓవర్ స్పీడుతో రావడం వల్ల దగ్గరికి వచ్చేదాక డివైడర్‌పై ఉన్న హెచ్చరిక బోర్డులు కనిపించక, వేగాన్ని కంట్రోల్ చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్లను వాహనాలు ఢీకొనడంతో డివైడర్లు, బోర్డులు డ్యామేజి అవుతున్నాయి. జాతీయ రహదారిపై గ్రామ శివారులో ఉన్న డివైడర్లు వాహనదారులపై ప్రాణాంతకంగా మారుతున్నాయి. గతేడాది లక్నవరం సరస్సుకు వెళ్లే క్రాస్ వద్ద ప్రమాదం జరిగి సోలార్ బ్లింకర్ పోల్ విరిగి కింద పడిపోయి సంవత్సరం గడిచిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. ఇంత వరకు దానిని రిపేరు కూడా చేయలేదు. చల్వాయి గెస్ట్ హౌస్ వద్ద యూ టర్న్ వద్ద సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ స్పాట్‌లను డెత్ స్పాట్‌లు గా ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ స్పాట్‌ల దగ్గర 20 నుంచి 30వరకు ప్రమాదాలు జరిగాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ స్పాట్‌ల దగ్గర ప్రమాదాలు జరిగిన సమయంలో డివైడర్లు మరియు సిగ్నల్ పోల్స్ దెబ్బ తింటున్నాయి, మళ్లీ వీటిని పునర్‌నిర్మాణం చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన డివైడర్లు రాత్రి వేళ్లల్లో వాహనచోదకుల ప్రాణాలను హరిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రతి డివైడర్ల ప్రారంభంలో రేడియంతో కూడుకున్న ప్రమాద హెచ్చరిక బోర్డులు, ఏర్పాటు చేసిన బోర్డులకు ఫ్లెక్సీలు కట్టకుండా తగు చర్యలు తీసుకునేలా, యూటర్న్‌ల దగ్గర సిగ్నల్ పని చేసే విధంగా, భారీకేడ్లు పెట్టి వాహనదారులని, గ్రామస్తులను ప్రమాదాల భారీ నుంచి చకాపాడాలి అని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు కారాణాలు అనేకం..

డివైడర్లు వాహనదారుల పాలిట మృత్యువుగా మారడానికి అనేక కారణాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో కనిపించక ఢీ కొట్టడం, కీలక ప్రాంతాల్లో అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన వాటి వద్ద వాహనం అదుపు తప్పి వాటిని ఢీ కొంటున్నాయి. ముఖ్యంగా యూటర్న్ పాయింట్‌ల దగ్గర సిగ్నల్స్ పని చేయక పోవడం, వాహనాల స్పీడ్‌ను కంట్రోచేసే స్పీడు బ్రేకర్లు నిర్మించకపోవడం ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. ఇక మద్యం మత్తులో దూసుకుపోతున్న వాహనాలు మరి కొన్ని. ఫలానా ప్రాంతం ప్రమాదకరమైంది, ప్రమాద హేతువు అని వివరించేందుకు సదరు స్పాటుకు కొద్ది దూరంలో హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేయక పోవడం, ఆయా స్పాట్లకు రెండు వైపులా కనీసం 200 మీటర్ల దూరంలో తొలి బోర్డు (కాషన్–1), 100 మీటర్ల వద్ద మరోకటి (కాషన్–2) కచ్చితంగా ఉండాలి.



లక్నవరం క్రాస్ వద్ద కింద పడిపోయిన సిగ్నల్ పోల్

సిగ్నల్స్ పని చేసేలా చూడాలి



ఇటీవల మా బంధువు ఒకరు చల్వాయి గెస్ట్ హౌస్ వద్ద యూటర్న్ క్రాస్ అవుతున్న సమయంలో గూడ్స్ బండి వచ్చి ఢీ కొట్టడంతో గాయాలతో బయటపడ్డాడు. గ్రామంలో యూ టర్న్ పాయింట్ చాలా ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే ఇక్కడ చాలా ప్రమాదాలు జరగగా, అనేక మంది కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డివైడర్ల దగ్గర, యూ టర్న్ పాయింట్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులతో పాటు, సిగ్నల్స్ పని చేసేలా చూడాలి. - వాసం స్వామి, చల్వాయి

జాగ్రత్త చర్యలు చేపడతాం..



ఇప్పటి వరకు మా దృష్టికి ఈ సమస్య రాలేదు. ప్రమాదాలు జరగకుండా మండలంలోని ప్రతి యూటర్న్ పాయింట్ దగ్గర సోలార్ బ్లింకర్స్ ఏర్పాటు చేస్తాం. సదరు కాంట్రాక్టర్‌తో రహదారిపై డివైడర్ల దగ్గర ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా, సిగ్నల్ పాయింట్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్ జాతీయ రహదారి–163 మెయింటెన్స్ పీరియడ్ ముగియలేదు.

- బి.కుమారస్వామి, ఎన్‌హెచ్ డీఈఈ, ములుగు

సీసీ కెమెరాలతో ప్రజలకు భద్రత



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు భద్రత కలుగుతుందని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని కామారం (పీటీ) గ్రామపంచాయతీలో గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వలన కలిగే భద్రత ప్రయోజనాలపై వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఎదైనా ఘటనలు, అసాంఘిక కార్యక్రమాలను, దొంగతనాలను సులువుగా గుర్తింవచ్చన్నారు. కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం పోలీసుల కర్తవ్యమని, కెమెరాల ఏర్పాటు బాధ్యత గ్రామస్తులు ఎన్నుకున్న కమిటీదే అన్నారు. గ్రామంలోని ప్రతి ఒకరు భాగస్వాములు కావడంతోపాటు విరాళాలను కూడా సేకరించాలన్నారు. గ్రామస్తులందరూ కూడా ముందుకు వచ్చి విరాళాల సేకరణ పక్రియను ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడారం జాతర మాజీ చైర్మన్ రేగ నర్సయ్య, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను మార్చొద్దు..



చల్వాయి–2 అంగన్‌వాడీ సెంటర్లో పిల్లలు

గోవిందరావుపేట: అంగన్‌వాడీ సెంటర్‌ను మార్చొద్దని..అన్ని రకాల సదుపాయాలతో ఇక్కడే బాగుందని లబ్ధిదారులు అధికారులతో విన్నవించారు. మండల పరిధిలోని చల్వాయి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్‌ను గ్రామంలోని బతుకమ్మ గడ్డ వద్దకు మార్చాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25 ఏళ్లుగా చల్వాయిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చల్వాయి–2 అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్నారు. అయితే బతుకమ్మ గడ్డలో చల్వాయి–2 అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించిన సొంత భవనం ఉంది. కాగా అక్కడ సరైన సదుపాయాలు లేక నిరుపయోగంగా ఉంది. భవనం చుట్టూ చెత్త, చెదారం ఉండడం, ప్రహరీ లేకపోవడం, లబ్ధిదారులకు చివరన ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. చల్వాయి హైస్కూల్ ప్రాంగణంలో అంగన్‌వాడీ సెంటర్‌ను సంబంధిత కార్యకర్త, ఆయాలు నడుపుతున్నారు. ఇప్పుడు అధికారులు మాత్రం సొంత భవనంలోకి సెంటర్‌ను మార్చి అక్కడే లబ్ధిదారులను పౌష్టికాహారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ సెంటర్ పరిధిలోని లబ్ధిదారులు అందరూ సెంటర్‌ను మార్చొద్దని, స్కూల్ ప్రాంగణంలోనే సెంటర్‌ను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక చాలా దూరంలో ఉందని, అక్కడ విషపూరితమైన కీటకాలు తిరుగుతుంటాయని, అక్కడికి పిల్లలని పంపబోమని తెలియజేస్తున్నారు. అంతేకాక ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గతంలో కొన్ని రోజులు అంగన్‌వాడీ సెంటర్‌ని బతుకమ్మ గడ్డలో నిర్వహించగా, లబ్ధిదారులు రాకపోవడంతో చల్వాయి హైస్కూల్‌లోకి మార్చి లబ్ధిదారులకు సేవలను అందజేస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను మార్చకుండా, లబ్ధిదారులకు నష్టం జరగకుండా చల్వాయి–2 అంగన్‌వాడీ సెంటర్‌ను యథావిధిగా స్కూల్ ప్రాంగణంలోనే కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

మురుగు నీరు వెళ్లేదెలా?



నివాసాల మధ్య నిలిచిన మురుగు

వాజేడు: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో నివాసల మధ్య మురుగు నీరు చేరింది. ఆ నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో అక్కడ ఉన్న స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల ఉధృతి పెరిగితే జ్వరాల బారిన పడతామేమోనని భయ పడుతున్నారు. మురుగు నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలను తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కొమురం భీమ్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ.. పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు. రామచంద్రాపురం గ్రామ సమీపంలోని 50 ఎకరాల గ్రామ కంటం భూమిని రెవెన్యూ అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించకుండా అటవీ శాఖకు ఎలా బదలాయిస్తారని ఆరోపించారు. పెసా గ్రామసభ నిర్వహించి మెజారిటీ సభ్యులు ఆమోదం తోనే బదలింపు జరగాలని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, పూనెం ప్రతాప్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజా మహేష్, మడకం రవి, లక్ష్మణ్‌రావు, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

సీఎం, మంత్రికి రుణపడి ఉంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న వంగ రవియాదవ్

ములుగు: నియోజకవర్గ అభివృద్ధికి నాలుగు వందల కోట్లతో అంతర్గత రోడ్లు, సంక్షేమ భవనాలు, మోడల్ బస్టాండ్, ఏటూరునాగారం బస్ డిపో కోసం మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డాక్టర్ ధనసరి సీతక్కకు రుణపడి ఉంటామని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యసంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, జిల్లా కార్యదర్శి యాసం రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి నల్లెల్ల భరత్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షకిల్‌పాషా, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రఘు, ప్రధాన కార్యదర్శి అనిల్, బీసీ సెల్ జిల్లా కోశాధికారి ఓడ రాజు, మండల ఉపాధ్యక్షుడు ఆర్షం రఘు, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బోయిని రాజుయాదవ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అభినవ్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామసమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం సీఐ బండారి కుమార్ వివరాలు వెల్లడించారు. చొక్కాల సమీపంలోని పాలెం ప్రాజెక్టు వైపు వెళ్లే వారికి ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అయితే వారు అనుమానస్పదంగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని, అయితే వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని విచారించగా సెంట్రింగ్ మేస్త్రీలుగా పనిచేసే లక్ష్మణ్, నరేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం గాంధీనగర్‌కు చెందిన వారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1.26 లక్షల విలువ చేసే దాదాపు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు సరఫరా చేసిన తాగిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన



ఏటూరునాగారం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై తాజొద్దీన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

ఏటూరునాగారం: అంగన్‌వాడీ బడుల్లో ఆట పాటలతో విద్యాబోధన చేస్తున్నారన్నారని ఎస్సై తాజొద్దీన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మబాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలని తెలిపారు. ప్రైవేటు కాన్వేట్ స్కూల్స్ పంపడం వల్ల వారిలో నైపుణ్యత కోల్పోతున్నారన్నారు. వారిపై ఒత్తిడి ఉండకుండా చదువు, పోషకాహారం అందిస్తారన్నారు. అనంతరం ఏసీడీపీఓ ప్రేమలత మాట్లాడుతూ.. సిబ్బంది రెండేళ్లలోపు చిన్నారుల ఇళ్లలోకి వెళ్లి గృహసందర్శన చేయాలన్నారు. క్రమతప్పకుండా విధులకు వెళ్లాలని, నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో వసంత, సరోజ, కృష్ణకుమారి, భవాని, విజయనిర్మల, రాజేశ్వరి, లలితకుమారి, పద్మలత, శ్రీలత, తరంగిణి, సోమలక్ష్మి, సుధ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కాటాపూర్‌లో రెండోవ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పిలల్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారధ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి ఆటపాటలతో బోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సమ్మక్క, నిర్మల, శ్రీకళ, వెంకటలక్ష్మి, నాగమణి, జయమ్మ పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న గోవింద్‌నాయక్

ములుగు రూరల్: మండలంలోని కన్నాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మేకల కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, గండి కుమార్, సురేష్, సంపత్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



మాట్లాడుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: గంజాయి, మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని పస్రా ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో యువతకు గంజాయి మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను పెట్టుకోని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు.

పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనం



సన్మాన కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 4న పదవీ కాలం ముగిసిన ఎంపీటీసీలకు మంగళవారం పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి విజయ్ చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వేరు వేరు పార్టీల నుంచి ఎంపీటీసీలుగా గెలువు పొందినప్పటికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా మండల పరిషత్‌కు వచ్చి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ఎంపీడీఓ జవహర్ రెడ్డి, ఏఓ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సహాయనిధి సభ్యులు

కన్నాయిగూడెం: మండలంలోని గూర్రేవులకు చెందిన షేక్.హాషీన కడుప్పునొప్పితో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. దాతల నుంచి ఆర్థిక సాయం చేయాలని కోరారు. విషయం తెలుకున్న ముప్పనపల్లి సహాయ నిధి గ్రూపు సభ్యులు మంగళవారం హాషీన కుటుంబ సభ్యులకు రూ.13,500ల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయనిధి సభ్యులు విజయ్, కిరన్, రాజు తదితరులు పాల్గొన్నారు.